# నీతోనే ఉంటా!

కల్పన స్వీట్ సిక్స్టీన్‌లో ఉన్నది.

కవి కల్పనలాగే అందంగా ఉంటుంది. ఆమె కళ్ళు బెజవాడ కనకదుర్గ కళ్ళలా అందంగా, విశాలంగా ఉంటాయి.

ఆమె చూపులు అమాయకంగా బెదిరిపోయిన లేడి చూపుల్లా ఉంటాయి. ఆమె నడుస్తుంటే, బాలమురళీకృష్ణ మనసులోనే ఏదో రాగాన్ని మననం చేసుకుంటూ, శబ్దం రాకుండా, తొడమీద చేత్తో వేస్తున్న తాళంలా, అడుగులు పడ్తుంటాయి. బంగారు జడకుప్పెలతో పొడవుగా ఉండే ఆమె జడ, కొండనాగును గుర్తు చేస్తుంది.

ఆమె కాలేజీ చదువులు చదవలేదు. ఆ మాటకొస్తే హైస్కూలు ముఖం కూడా చూడలేదు. ఎనిమిది వరకు చదివింది. ఆ అందమైన ముఖాన్ని వదిలిపోలేక పసితనం తాలూకు అమాయకత్వం, యవ్వనపు నిగారింపులలో పెనుగులాడుతోంది.

ఆమె తనలో వస్తున్న మార్పుకు ఏదో తెలియని అలజడికి గురి అవుతున్నది. తమాషా ఆలోచనలు వస్తున్నాయి. అందమైన కలలు, మేల్కొని ఉండగానే, పట్టపగలే వస్తున్నాయి. మనసులో ఏదో అలజడి. ఏమిటో తోచనితనం. దేన్నో పొందాలనే ఆరాటం. ఆమె నవలలు చదువుతూ ఉంటుంది. తనకు కావాల్సిందేదో ఆ నవలల్లో దొరుకుతున్నట్లుగా అనిపిస్తున్నది. ఈ మధ్య మంత్రతంత్రాల నవలలు ఎక్కువగా చదువుతున్నది. దెయ్యాల కథలు చదువుతున్నది. చిన్నప్పుడు అమ్మమ్మ దెయ్యాల కథలు చెబుతూ ఉంటే ఎంతో శ్రద్ధగా వినేది. రాత్రి అయేసరికి భయంతో తల్లిని కౌగలించుకొని పడుకొనేది. ఇప్పుడూ పగలంతా చదువుతూ ఉంటుంది. రాత్రిళ్ళు భయపడుతూ ఉంటుంది. కల్పన అన్న కిశోర్ హైదరాబాద్‌లో ఎం. ఏ. తెలుగు చదువుతున్నాడు. చెల్లెలు అలాంటి నవలలు చదవడం చూసి రెండు మూడు సార్లు కోపగించుకొన్నాడు. కిషోర్ చెల్లెలికి కొన్ని నవలలు తెచ్చి ఇచ్చాడు. పది పేజీలు కూడా ఆ నవలలు చదవలేక అవతల పారేసింది. కల్పన ఈడువాళ్ళు ఒకచోట చేరి కబుర్లు చెప్పుకొనేవాళ్ళు. సినిమాల గురించీ, పుస్తకాల గురించీ, వాటిలోని హీరోల గురించీ, వారిమధ్య చూపించిన ప్రేమ గురించీ—ఎన్నెన్నో కబుర్లు. వాళ్ళందరికీ ఏదో ఒకనాడు తన హీరో తనను వెతుక్కుంటూ వస్తాడనే నమ్మకం ఉన్నది.

అది ఒక గ్రామం. ఆ గ్రామం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడో ఓ మూలగా లేదు. హైదరాబాద్‌కు పదిహేను మైళ్ళ దూరంలోనే ఉన్నది. అయినా ఆ గ్రామంలో బోలె డంత దరిద్రంతో పాటు అజ్ఞానం కూడా ఉన్నది. మూఢ నమ్మకాల గురించి ఇక చెప్పనక్కర్లేదు. ఎక్కడైన ఒకే చోట, ఏదో బొరియలో పది తేళ్ళు ఒక్కసారి కన్పిస్తే చాలు. ఏదో చేతబడి కారణంగానే అన్ని తేళ్ళు అక్క డున్నాయని ఆ ఊరి ప్రజలు నమ్ముతారు. నమ్మనివాడిని పిచ్చివాడికిందయినా జమకడ్తారు, లేకపోతే శత్రువుగానైనా చూస్తారు.

కల్పన తండ్రి చంద్రయ్య సన్నకారు రైతు. తల్లి పార్వతమ్మ. రెండు గేదెల్ని పెట్టుకొని పాలూ, నెయ్యీ వ్యాపారం చేస్తుంది. కిషోర్ కల్పనకంటే ఐదేళ్ళు పెద్ద. ఎం. ఏ. మొదటి సంవత్సరం పూర్తి అయింది. శెలవలకు వచ్చాడు. మురళి కిషోర్ క్లాస్ మేట్. ఆ ఊరివాడే. ఇద్దరూ స్నేహితులు. అయినా ఇద్దరి భావాలు కలవవు. మురళి చదువుతున్నాడన్నమాటే గాని మూఢ నమ్మకాల్లో తన తండ్రికీ, అతనికీ బేదం కన్పించదు. కిషోర్‌కు మురళితో వాదించి లాభం లేదని అతనితో ఆ విషయాల గురించి మాట్లాడటమే మానేశాడు.

మురళి కిషోర్‌తో వాళ్ళింటికి వచ్చినరోజు సాయంత్రం వాకిట్లో ముగ్గేస్తున్న కల్పనను చూశాడు. కల్పన మురళిని

చూసి ముగ్గుచిప్పను వదిలేసి లోపలకు పరుగు తీసింది. వెళ్ళి తలుపుచాటున నిల్చుంది. మురళి మంత్రముగ్ధుడిలా నిలబడి పోయాడు. కల్పన తల బయటికి పెట్టింది. ఇద్దరి కళ్ళు కలుసుకొన్నాయి. గుండె దడదడ లాడింది. తన గదిలోకి పరుగుతీసి మంచంమీద కూర్చుంది.

తను చదివే కథల్లోని కథానాయకుడు కన్పించాడు కల్పనకు. కథానాయకుడిని చూడగానే కథానాయకి మనసులో కలిగే స్పందనను కల్పన ఎన్నో నవలలలో చదివింది. తనకు అచ్చం అలాగే ఉంది అన్పించింది. "క్షణంలో సగంసేపు ఇద్దరి చూపులూ పెనవేసుకొన్నాయి." అనే వాక్యాన్ని ఎన్నోసార్లు కల్పన నవలల్లో చదివింది. అవును! అచ్చం అలాగే జరిగింది. అతని చూపులు తన చూపులతో క్షణంలో సగంసేపు పెనవేసుకున్నాయి! ఆలోచిస్తున్న కల్పనకు ఎలాగో ఎలాగో ఉన్నది. ఆ రాత్రి కల్పనకు ఆకలి కాలేదు. అమృతం తాగినట్టుగా ఉన్నది. తనకు కొత్త రెక్కలు వచ్చినట్టూ, ఆకాశంలో ఎగరాలన్నట్టూ ఉన్నది. పాడాలని ఉన్నది. ఆడాలని ఉన్నది. పెదవులు ఉన్నట్టుండి చిరునవ్వుతో కొద్దిగా విచ్చుకొంటున్నాయి. వళ్ళు విరుచుకొంటున్నది.

మురళి రోజూ ఆ యింటికి వస్తూనే ఉన్నాడు. ఇంట్లో చనువుగా తిరుగుతున్నాడు. అతనికి ఆ యింట్లోనే ఎక్కువ సేపు గడపాలని ఉంటుంది. కిషోర్ బయటికి వెళదామని

తీసుకెళతాడు. రోజుకు ఏదో ఒకసారి ఇద్దరి కళ్ళూ కలుసుకుంటూనే ఉన్నాయి.

'మురళి మంచి పిల్లవాడు. మన కులమయితే కల్పనను ఇచ్చేవాళ్ళం!' అన్నది ఒకరోజు భోజనాల దగ్గర తల్లి భర్తతో. కల్పన తల వంచుకునే తండ్రి సమాధానం కోసం ఎదురుచూసింది.

'అవునవును!' అన్నాడు చంద్రయ్య.

అన్నయ్య ఏదో అంటాడని ఆశించిన కల్పనకు నిరాశే ఎదురైంది.

'మన కల్పనకు అంతకంటే మంచివాడ్నే తెస్తానమ్మా!' అన్నాడు కిషోర్.

'అంతకంటే మంచివాడెవరికావాలి? అతనే కావాలి' అని అనాలనిపించింది కల్పనకు. 'అమ్మో! అంతమాటనడమే' కల్పనకు అన్నమీద కోపం వచ్చింది. అన్నయ్యకు మురళి అంటే ఇష్టంలేదా?

మురళి మనసు కల్పన చుట్టూనే తిరుగుతోంది. పెద్దవాళ్ళయిష్టంతో ఈ పెళ్ళి జరగదని మురళికి తెలుసు. కల్పన మనసు తెలుసుకోవాలి. ఆమె తనను ప్రేమిస్తున్నది. ఆమెను దొంగతనంగా తీసికెళ్ళిపోయి గుళ్ళో పెళ్ళి చేసుకోవాలి. ఆ తర్వాత మెళ్ళో పూలదండలతో వచ్చి పెద్దవాళ్ళ పాదాలకు నమస్కరిస్తే సరి! పరిపరి విధాల ఆలోచిస్తూ పథకాలు వేసుకుంటున్నాడు మురళి.

ఆ రోజు కిషోర్ ఊళ్ళో లేడని తెలుసు. చంద్రయ్య ఆవేళప్పుడు ఇంట్లో ఉండడని తెలుసు. పార్వతమ్మ ఉన్నా నిద్రపోతూనో, లేక ఏ పొరుగింటికో వెళ్ళి ఉండొచ్చుగా!

ఇవ్వాళ ఏమైనా సరే కల్పనతో మాట్లాడాలి అనుకొంటూ, జారిపోతున్న గుండెను పైకెగదోసుకొంటూ వచ్చాడు మురళి.

చిన్నగా తలుపు తట్టాడు. కళ్ళు మూసుకొని కల కంటున్నది కల్పన... ఆ కలల్లో... తనూ... మురళీ... కొండల్లో పరుగులు దీస్తున్నారు. చెట్టు కొమ్మలు పట్టుకొని వేలాడుతూ పాటలు పాడుతున్నారు. సెలయేరుదగ్గర కూర్చుని కల్పన మోకాళ్ళదాకా చీర లాక్కొని తన అందమైన పాదాలను నీళ్ళలో తపతప కొట్టుతున్నది. మురళి తన పాదం చేతిలోకి తీసుకొని కందిపోయిందేమోనని చూస్తున్నాడు. తను పాదం లాక్కుని కిలకిల నవ్వుతూ పరుగులు తీస్తోంది.

'ధన్! ధన్!' తలుపు మోతకు త్రుళ్ళిపడింది. అబ్బ! అమ్మ అప్పుడే వచ్చేసిందా? కాంతమ్మ పిన్నికి అరిసెలు వండిపెట్టాలని వెళ్ళిందిగా? అనుకొంటూ యాదాలాపంగా తలుపు తెరిచింది.

ఎదురుగా తన హీరో! కల్పన గుండె దడదడలాడింది కాళ్ళు వణుకుతున్నాయి. పడిపోతానేమోనన్నట్టు ద్వారబంధం పట్టుకొన్నది. మురళి కళ్ళప్పగించి చూస్తూ

నిల్చున్నాడు. భాష మర్చిపోయిన వాడిలా నిల్చున్నాడు. రెప్ప వెయ్యడం మర్చిపోయినట్టు చూస్తున్నాడు.

అమ్మో! అలా చూస్తున్నాడేం? ఇంట్లో ఎవరూ లేరుగా? మరి వెళ్ళిపోడేం? కల్పనకు తన ముందున్న హీరో అకస్మాత్తుగా విలన్‌గా మారిపోయినట్టుగా అన్పించింది.

"లోపలకు రానివ్వవా?" మురళి కంఠం అదోలా పలికింది. అతని కంఠం రోజూ వింటూనే ఉన్నది. కాని అలా ఎప్పుడూ లేదు. లోపలకు వస్తాడా? అమ్మో ఎవరైనా చూస్తే? అమ్మ వస్తే?

"ఎ... ఎవరూ లేరు..." ఎలాగో చటుక్కున అని గిరుక్కున తిరిగి వెళ్ళబోయింది కల్పన.

మురళి ఆమె చేతిని గబుక్కున పట్టుకున్నాడు.

కల్పన చేతికి కాలనాగు చుట్టుకొన్నట్టుగా భయపడి పోయింది. ఒక్కసారిగా చెయ్యి లాగేసుకొన్నది. లోపలకు పరుగుతీసింది.

"కల్పనా? ఒక్కమాట విను? నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నేనంటే నీకు ఇష్టం లేదని అర్థం అయింది. అయినా నేను నీతోనే ఉంటా! నిన్ను విడిచి ఉండలేను."

కల్పనకు వెనకనుంచి మాటలు విన్పించాయి. వళ్ళంతా చెమట్లు పట్టింది. గబుక్కున తన గది తలుపులు గడియ పెట్టుకొని మంచంమీద వాలిపోయింది. అతను పట్టుకొన్న

చేతిని ఎత్తి చూసుకొన్నది. ఆ స్పర్శ ఇంకా అక్కడ ఉన్నట్టే అనిపిస్తోంది. 'నీతోనే ఉంటా! నీతోనే ఉంటా!' ఆ కంఠం వినిపిస్తోంది. కల్పనకు సంతోషంగా ఉంది. భయంగా ఉంది. ఏదో తన్మయత్వం-అంతలోనే తత్తరపాటు-ఏమిటి ఇలా ఉంది? తనకూ అతనంటే ఇష్టమేనని ఎలా చెప్పడం? చీటీ రాస్తే? ఎవరిచేత పంపించాలి

పదహారేళ్ళ వయసులో ఉన్న ఆడపిల్ల మనసూ, శరీరం కూడా శ్రుతిచేసి పెట్టిన వీణలా ఉంటాయి. మొదటిసారిగా ఒక పురుషుడు కల్పన చేతిని బలంగా పట్టుకొన్నాడు. ఆమె శరీరంలోని తంత్రులన్నీ ఒక్కసారిగా మ్రోగాయి. ఆ మోత కల్పనను భయపెట్టింది. కాని నిముషాలు గడుస్తున్నకొద్దీ ఆ అనుభవం వింత అనుభూతితో ఆమె మనసును నింపేస్తున్నది.

తలుపులు మోగాయి. కల్పన చివ్వున లేచి కూర్చుంది. వళ్ళంతా చెమట్లు పట్టాయి. ఇదేమిటి? అతను వెళ్ళిపోలేదా? లోపలకు వచ్చాడా? తన గది తలుపులు కొడుతున్నాడా? అమ్మో! ఇదేమిటి ఇలా చేస్తున్నాడు?

"కల్పనా! కల్పనా!" తల్లి కంఠం. కల్పన మంచం దిగింది. ఎలాగో వచ్చి తలుపు తీసింది.

"అదేమిటే తలుపులన్నీ బార్లా తీసి గదిలో పడు కున్నావ్? ఎవరైనా జొరబడితే? అదేమిటి అలా ఉన్నావే?

అలా చెమట్లు పోస్తున్నాయేం? భయపడ్డావా? వెధవ పుస్తకాలు చదవొద్దే అంటే వినవాయె!" తల్లి ఆప్యాయంగా కూతురి నుదురు తుడిచింది. కల్పన తేరుకొన్నది. గుండెల నిండుగా గాలి పీల్చుకొన్నది.

అమ్మయ్య! గండం గడిచింది! అమ్మ వచ్చేసరికి అతను వెళ్ళిపోయాడు! లేకపోతే తన వాలకం చూసి అమ్మ ఎన్ని యక్ష ప్రశ్నలు వేసేదో? ఏదో పెద్ద ప్రమాదంనుంచి బయటపడినట్టుగా అనిపించింది కల్పనకు.

ఆ రాత్రంతా కలత నిద్రలోనే గడిచింది కల్పనకు. తెలతెలవారుతూ ఉంది. కల్పవ కలలో ఉంది. 'నేను వచ్చేశాను. ఇక నీతోనే ఉంటా?' అంటూ కల్పనను రెండు చేతులతో గట్టిగా పట్టుకొని గుండెలకు హత్తుకొన్నాడు మురళి.

"కల్పనా! కల్పనా! త్వరగా లే!" గాభరాగా భుజాలు పట్టుకొని ఊపుతూ లేపింది పార్వతమ్మ.

కల్పన త్రుళ్ళిపడి లేచింది. ఇంతసేపూ తను అనుభవించింది కలేనా?

"లేమ్మా! పొయిమీద పాలున్నాయ్! పొంగకుండా చూడు! బిడ్డ ఇంత అఘాయిత్యం ఎందుకు చేసుకున్నాడో?" దాదాపు ఏడుస్తూనే అన్నది పార్వతమ్మ.

కల్పన తల్లి ముఖంలోకి అయోమయంగా చూసింది.

"మురళి చచ్చిపోయాడమ్మా! నేను వెళ్తున్నాను. జాగ్రత్త. ఇంట్లో ఎవరూ లేరు" అంటూ పార్వతమ్మ గబ గబా బయటికి వెళ్ళిపోయింది.

మురళి చచ్చిపోయాడా? ఎప్పుడు? ఎలా? నిన్న 'నీతోనే ఉంటా!' అన్నాడు. ఇప్పుడు కలలోకి వచ్చి 'వచ్చేశాను కల్పనా' అంటూ తనను కౌగలించుకున్నాడు. అంటే అంటే? మురళి తనకోసం చచ్చిపోయాడా? దెయ్యం అయి తనదగ్గరకు వచ్చాడా? కల్పన వళ్ళు చల్లబడింది. వెన్నెముకలోకి ఏదో పాకుతున్నట్లుగా ఉంది.

'నీతోనే ఉంటా! నీతోనే ఉంటా!' దూరం నుంచి కొండలమధ్యగా వస్తున్న ప్రతిధ్వనిలా చెవులకు సోకుతోంది.

"కల్పనా !"

ఆ గొంతు! ఆ గొంతు! అవును మురళి గొంతు!

కల్పన కెవ్వున అరవాలనుకున్నది. గొంతు పెగల్లంలేదు. మంచంమీద పడిపోయింది. ఇంకా బుర్ర పనిచేస్తోనేవుంది. ఎవరో వచ్చి మంచంమీద కల్పన పక్కన కూర్చున్నారు. ఎవరిదో చెయ్యి ఆమె శరీరాన్ని నిమురుతోంది. అది... అది!... పురుషస్పర్శ! కల్పన శరీరంలో ఏ అవయవాన్నీ కదిలించలేకపోతున్నది. కీలు వదులైన రబ్బరు బొమ్మలాగా మంచంమీద పడివుంది. ఏదో జరుగుతోంది. అస్పష్టంగా తెలుస్తోంది.

మురళి శవాన్ని పోస్టుమార్టం చెయ్యడానికి ఆసుపత్రికి తీసుకెళ్ళారు. కల్పన తల్లీ, తండ్రి వచ్చారు. పాలన్నీ పొంగిపోయాయి. నిప్పు ఆరిపోయింది. కుండ కిందపడి పగిలి పోయి ఉన్నది.

వంటగది మట్టినేలమీద పాలు పొడలు పొడలుగా కొన్నిచోట్ల ఎండిపోయాయి. రెండు పిల్లులు పగిలిపోయిన కుండ పెంకుల్లో మిగిలిన పాలు నాకుతున్నాయి. పార్వతమ్మ మనసు అసలే బాగాలేదు. ఆ దృశ్యం చూడగానే దాదాపు పిచ్చిదే అయింది. "ఎక్కడ చచ్చావే?" అని అరుస్తూ కూతురి గదిలోకి వెళ్ళింది. మంచంలో అచేతనంగా పడిఉన్న కూతుర్ని చూసి కేకలు పెట్టింది. చంద్రయ్య పరిగెత్తుకొచ్చాడు. కల్పన చీర తొలిగి మోకాళ్ళమీద కున్నది. పక్క చుట్టు చుట్టినట్టు ఓ పక్కగా ఉంది. రెండో పక్క నులక మీద పడి ఉంది కల్పన. మంచం కోడు దగ్గర గాజులు పగిలిన ముక్కలున్నాయ్. భార్యాభర్తలు గాభరాగా కల్పనను కదిపారు. అంతలో కిషోర్ వచ్చాడు. పరిస్థితి చూశాడు. తల్లి శోకాలు పెట్టి ఏడుస్తున్నది. కల్పన గట్టిగా ఊపిరి పీలుస్తోంది. గ్లాసుతో నీళ్లు తెచ్చి ముఖంమీద చల్లాడు. "అమ్మా నువ్వు అల్లరి చెయ్యకు" తల్లిని కసురుకొన్నాడు. పార్వతమ్మ టవలుతో ముఖం తుడిచింది. కల్పన కళ్ళు తెరిచింది. పిచ్చి చూపులు చూడసాగింది.

'చెల్లీ! ఇలా చూడు! నీ అన్నయ్యను!' అన్నాడు కిషోర్.

"ఏం జరిగింది? ఎవరొచ్చారు?" చంద్రయ్య కంఠం కటువుగా ఉంది. కిషోర్ తండ్రి ముఖంలోకి చూసాడు.

"చెప్పవేమే? ఎవరొచ్చారు!" తల్లి కూతుర్ని గట్టిగా ఊపుతూ ఆక్రోశిస్తున్నట్టు అడిగింది.

కిషోర్ అయోమయంగా చూస్తున్నాడు. తల్లిదండ్రుల ప్రశ్నలు అర్థం కావడంలేదు. వాళ్ళెందుకలా గద్దిస్తున్నారో అర్థం చేసుకోవడానికి కొద్ది క్షణాలు పట్టింది. ఆ తర్వాత చెల్లెల్ని పరిశీలనగా చూశాడు. అప్పుడే ఈ లోకంలోకి వచ్చినట్టయి కల్పన చివ్వున లేచి కూర్చుంది. గాభరాగా బట్టలు సర్దుకొన్నది. గాజులు పగిలి రక్తం కారుతున్న కుడిచేతిని చూసుకొన్నది.

"అయ్యో! నాయనో! కొంప మునిగిందిరోయ్?" తల పట్టుకొని కూలబడింది పార్వతమ్మ, చంద్రయ్య నిప్పులు క్రక్కుతున్నాడు.

"ఎవరొచ్చారు?" పులిలా గాండ్రించాడు చంద్రయ్య.

కల్పన ముఖం రెండు చేతులతో కప్పుకొని ఏడవ సాగింది. చెబుతావా లేదా అంటూ చరణాకోల తెచ్చాడు చంద్రయ్య. ఎత్తిన చేతిని పట్టుకొన్నాడు మురళి. 'ఏమిటిది? అసలేం జరిగిందో తెలుసుకోకుండా?'

"ఇంకా ఏముందిరా తెలుసుకోవడానికి?"

'అన్నయ్యా!' గువ్వలా తనలోకి తను ముడుచుకు పోతూ ఆర్తనాదం చేసింది కల్పన.

'చెప్పు చెల్లీ! ఎవరొచ్చారు? నీకేం భయం లేదు. ఏం జరిగిందో చెప్పు! ఎవరొచ్చారు?'

"మురళి!"

అందరూ త్రుళ్ళిపడ్డారు. "మురళా? ఎప్పుడు?" కిషోర్ అడిగాడు.

"అమ్మ నన్ను నిద్రలేపి వెళ్ళిపోయింది. నేను మంచం మీదనుంచి లేవాలనుకున్నాను. లేవలేకపోయాను. అపుడే వచ్చాడు."

"అదేమిటమ్మా! అప్పటికే మురళి చచ్చిపోయాడుగా? నువ్వు చూశావా కళ్ళతో"

"నన్ను పిలాచ్చడు. నీతో ఉండటానికే వచ్చేశాను. నీతోనే ఉంటాను అన్నాడు. ఆ తర్వాత నా మంచంమీదకు వచ్చి కూర్చున్నాడు. ఆ తర్వాత... చెప్పను చెప్పను..." అంటూ ఏడవసాగింది.

"గాలి! అయ్యో! కటికచావు చచ్చాడు. దెయ్యం అయాడు. నా బిడ్డను పట్టాడు. అయ్యో! నా బిడ్డో!" అంటూ కూతుర్ని రెండు చేతులతోనూ పొదివిపట్టుకొన్నది పార్వతి.

చంద్రయ్య వెర్రిగా చూస్తున్నాడు. "ఇంకా అలా చూస్తారేమండి. వెళ్ళి ఆ పోలయ్యను తీసుకురండి. మంత్రం

వేయించి, తాయత్తు కట్టిద్దాం." కిషోర్ ఏదో అనాలనుకొన్నాడు. అప్పటికే చంద్రయ్య వెళ్ళిపోయాడు.

చెల్లెలి మాటల్ని మననం చేసుకోసాగాడు. మురళి తన చావుకు ఎవరూ బాధ్యులు కారంటూ ఒక చీటీ రాశాడు. మరో చీటీలో 'ప్రియా! నేను ఎక్కడికీ వెళ్ళడం లేదు. నీతోనే ఉంటాను. ఆత్మహత్య చేసుకున్నవాళ్ళు దెయ్యాలవుతారట! అందుకే ఈ పని చేస్తున్నాను."

ఆలోచించిన కొద్దీ కిషోర్‌కు మతి పోతున్నట్లే ఉన్నది. మురళి కల్పనను ప్రేమించాడా? అందుకే ఆత్మహత్య చేసుకొన్నాడా? అతను చీటీలో రాసినమాటలే ఇక్కడ కల్పనకు వినిపించాయా? అంటే? అంటే? మురళి దెయ్యం అయ్యాడా? ఛ! నాన్సెన్స్ తనుకూడా ఇలా ఆలోచిస్తున్నాడేం? తను దేవుణ్ణే నమ్మడు! దెయ్యాలను నమ్మడం ఏమిటి? మరి కల్పనకు ఆ చీటీలో రాసిన మాట లెలా వినిపించాయి! కల్పనను మళ్ళీ అడిగాడు. కల్పన తను ఆ మాటలు స్పష్టంగా విన్నట్లు చెప్పింది. అదే కాదు, అతను తన శీలాన్ని హరించినట్టుకూడా చెబుతూ బావురుమన్నది. ఆ మాటలు కల్పన పూర్తి స్పృహలో ఉన్నట్టుగా చెప్పడంలేదు. ఆమె ముఖం ఆ విషయాలు చెబుతున్నప్పుడు అదోలా మారిపోవడాన్ని కూడా గమనించాడు.

కల్పన సరిగా అన్నం తినడం లేదు. కొంత సేపు బాగా ఉంటున్నది. కొంతసేపు పిచ్చిగా పిచ్చిగా ఏదేదో

మాట్లాడుతోంది. 'అడుగో వచ్చాడు, నన్ను పిలుస్తున్నాడు' ఇంకా ఏమేమో అంటూ ఒకసారి నవ్వితే మరోసారి ఏడుస్తుంది.

కల్పనకు మురళి దెయ్యం అయి పట్టి, పీడిస్తున్నాడని ఊళ్ళో అందరికీ తెలిసింది. మంత్రగాళ్ళు వస్తున్నారు, వెళ్తున్నారు. కాని కల్పన రోజురోజుకు చిక్కిపోతున్నది. అన్నం తినదు. అన్నంముందు పెడితే పురుగులు అంటూ ఏడుస్తుంది. మాట్లాడదు. కిషోర్ చెల్లెల్ని పట్నం తీసుకెళ్ళి డాక్టర్లకు చూపిస్తానంటే తల్లీ తండ్రీ విన్పించుకోడంలేదు. 'గాలి చేష్టలని స్పష్టంగా తెలుస్తుంటే, మీ కుర్రకారుకేం తెలుసు– ఏదో అంటారు' అంటూ ఊళ్లో వాళ్ళు కూడా తలోకమాట అంటున్నారు.

కిశోర్‌లో పిరికితనం ప్రవేశించింది. ఒక్క ప్రశ్నకీ సమాధానం దొరకడం లేదు– అతను కాగితంలో రాసిపెట్టిన మాటలే చెల్లెలికి కలలో కన్పించి అన్నాడు. ఆ తర్వాత కూడా శవం అక్కడ ఉండగానే ఆమెకు విన్పించాయి. అతను రోజూ అల్లరి చేస్తున్నాడంటున్నది. తల్లి చెప్పింది కల్పనకు... నెల తప్పిందని. కిశోర్ అవాక్కయిపోయాడు. ఈ కేసు ఏదో పేపర్లో వచ్చింది. ఆ అమ్మాయికి నయం చెయ్యగల మాంత్రికుడు ఎవరైనా ఉంటే రావాల్సిందిగా ఆ తల్లిదండ్రులు కోరుతున్నట్లుగా కూడా వేశారు.

ఈ భౌతికవాదులంతా ఏమయ్యారు? మీటింగుల్లో మాట్లాడితే చాలా? ఇలాంటి కేసులగురించి విన్నప్పుడు రాకూడదా? చేతనైతే ఇది దెయ్యంపని కాదని నిరూపించవచ్చుగా? కిషోర్ కుమిలిపోతున్నాడు. కిషోర్ ఒకరోజు బయటినుంచి వచ్చేసరికి ఒక మాంత్రికుడు కల్పన జుట్టు పట్టుకొని వంగదీసి చీపురుకట్టతో వీపుమీద "వెళ్తావా? వెళ్ళవా?" అంటూ కొడ్తున్నాడు. కిషోర్ పరుగులాంటి నడకతో వచ్చాడు. ఆ మంత్రగాడ్ని ఒక్కతోపు తోశాడు. ఎదురుగా కూర్చుని ఆ హింస చూస్తున్న తల్లినీ తండ్రినీ కోపగించుకున్నాడు. అరిచాడు! మంత్రగాడు పారిపోయాడు. ఆ ఇంటికి ఆ ఊళ్ళోవాళ్ళు రావడానికి భయపడుతున్నారు. మంత్రగాడి పనికి అడ్డువచ్చినందుకు చంద్రయ్య కొడుకుమీద కేకలు వేశాడు. దెబ్బలతో సొమ్మసిల్లి పడిపోయిఉన్న చెల్లెల్ని ఎత్తి మంచంమీద పడుకోబెట్టాడు కిషోర్. బంగారు బొమ్మలా ఉండే కల్పన ఎముకలగూడులా అయింది.

కిషోర్ ఆ రాత్రంతా ఆలోచించాడు. ఏమైనాసరే చెల్లెల్ని మంచి డాక్టరుకు చూపించాలని నిర్ణయించుకొన్నాడు. అంతకుముందు ఆ ఊరు డాక్టరు చూసి తనకు జబ్బేమీ కన్పించడంలేదని చెప్పాడు. ఆమె అలా అవడానికి కారణం తను చెప్పలేనన్నాడు. అతని మాటల్నిబట్టి కిశోర్‌కు అతను కూడా అతీత శక్తుల్ని నమ్ముతున్నట్టే అన్పించింది.

రెండోరోజు ఉదయం ఒక కారు వచ్చి ఆగింది ఇంటి ముందు. కారులో నుంచి ఇద్దరు వ్యక్తులు దిగారు. అందులో ఒకతను కుర్రవాడు. ముఖంలో వర్చస్సు ఉన్నది. అయితే పెద్ద కుంకుమబొట్టూ, ఆ పంచెకట్టూ అతని వంటిమీద సహజంగా కన్పించలేదు కిషోర్‌కు. రెండో అతను సన్నగా పీలగా చేతిలో ఒక సంచితో ఉన్నాడు. కిషోర్, చంద్రయ్య ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"వారి పేరు ప్రచండబాబా! గొప్ప మాంత్రికులు. పేపర్లో మీ అమ్మాయి గురించి చదివి వచ్చారు. నేను వారి అసిస్టెంటును" అని పరిచయం చేసుకున్నాడు చేతిసంచి తాలూకు వ్యక్తి.

"మంత్రాలూ- తంత్రాలూ- అక్కర్లేదు వెళ్ళండి!" అని అరవాలనిపించింది కిషోర్‌కు.

చంద్రయ్య కళ్ళు మెరిశాయి. "రండి! బాబూ! దేవుళ్ళా వచ్చారు. మా బిడ్డను ఎలాగయినా రక్షించండి" ఏడుపు గొంతుతో అన్నాడు. రెండు చేతులూ జోడించాడు. తండ్రి అలా అంటుంటే కిశోర్ ఏమీ అనలేకపోయాడు.

ఇద్దరూ లోపలకు నడిచారు. కల్పనను చూశారు. మెల్లో ఇంట్లో ముగ్గు వేయించారు. నిమ్మకాయలు కావాలంటే కిశోరునే వెళ్ళమన్నాడు తండ్రి. కిశోరు బజారుకు వెళ్ళి నిమ్మకాయలు తెచ్చాడు. అప్పటికే సాంబ్రాణి పొగ

వస్తోంది. కల్పన ముగ్గులో కూర్చుని ఊగుతున్నది. కిశోర్ ముఖంలో కోపం కన్పిస్తున్నది. ప్రచండబాబా అతని ముఖం లోకి చూసి చిరునవ్వు నవ్వాడు.

వీడు మరీ భయంకరంగా ఉన్నాడు. వీడూ చీపుర్తో కొడ్తాడేమో? అది జరిగితేమాత్రం తను వీడి రక్తం కళ్ళ జూస్తాడు! మనసులోనే అనుకుంటూ కూర్చున్నాడు. పార్వతమ్మా, చంద్రయ్యా దిగులుగా గోడకు చేరబడి కూర్చుని ఉన్నారు. రెండోవాడు సంచిలోనుంచీ ఓ కత్తిని తీసి ఇచ్చాడు. ప్రచండబాబా నిమ్మకాయను కోశాడు. ఎర్రటి రక్తం కారింది. కిశోర్ కళ్ళు పెద్దవి చేసుకుని చూశాడు. అలా అర డజను కోశాడు. అన్నిటి నుంచీ ఎర్రటి రక్తం కారింది.

"రా! వచ్చావా? పలుకు?" ప్రచండబాబా కల్పనను చూస్తూ అన్నాడు!

"వచ్చాను" కల్పన కంఠం మారిపోయింది.

"ఈ అమ్మాయిని వదిలి వెళ్ళిపో?"

"వెళ్ళను! వెళ్ళనుగాక వెళ్ళను" అంటూ కల్పన ఊగిపోతున్నది.

"వెళ్ళవూ? ఎలా వెళ్ళవో చూస్తాను" కల్పన జుట్టులోనుంచి కొన్ని వెంట్రుకల్ని పుటుక్కున లాగాడు. రెండోవాడు అప్పటికే రెడీగా ఉంచిన సీసాలో ఆ వెంట్రు కల్ని వేసి సీసా మూత పెట్టాడు. వెంట్రుకలు సీసాలో

కదులుతున్నాయి. పైకీ కిందకూ లేస్తున్నాయి. ప్రచండ బాబా ఆ సీసాను చేతిలోకి తీసుకొని 'ఆగు! తలెత్తు? ఇటు చూడు! కల్పనా! నిన్నే! చూడు! మురళిని ఇందులో బంధించాను. ఎలా కొట్టుకొంటున్నాడో చూడు చూడు.'

కల్పన చూస్తున్నదో లేదో కాని మిగతా ముగ్గురూ చాలా ఆశ్చర్యంగా చూస్తున్నారు.

'చంద్రయ్యగారూ! ఇలా రండి! ఈ సీసా తీసుకెళ్ళి దొడ్లో ఎవరికీ తెలియనిచోట పాతిపెట్టండి. పదిహేను నిముషాల్లో ఆ పని అయిపోవాలి. మీరూ వెళ్ళండి!' అన్నాడు కిశోర్‌తో. కిశోర్ తండ్రి వెనకే యాంత్రికంగా నడిచాడు.

కల్పన చెయ్యి పట్టుకొని గదిలోకి తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టాడు బాబా! పార్వతమ్మను బయటే ఉండమన్నాడు. సంచి అతనుకూడా లోపలకు వెళ్ళాడు. పదిహేను నిముషాల్లో ఇద్దరూ బయటికి వచ్చారు.

'అమ్మా! ఇక మీ బిడ్డకు ఏం పర్వాలేదు. హాయిగా నిద్రపోతున్నది. లేపకండి. సాయంత్రం ఆరు గంటలకు, సరిగ్గా ఆరు కొట్టగానే లేచి కూర్చుంటుంది. ఆకలి అంటుంది. ఈ లోపల ఆమెకు ఇష్టమైన పదార్థాలు చేసి ఉంచండి.'

'అన్నం తినడంలేదు బాబూ!'

'ఇవ్వాళ తింటుంది.' అప్పటికే వాళ్ళపని పూర్తి చేసి వచ్చి నిల్చున్న కిశోర్, చంద్రయ్య అతని మాటలు విన్నారు.

చంద్రయ్య బాబా రెండు చేతులూ పట్టుకొన్నాడు. మాటలు పెగల్లేదు. 'బాధపడకండి. ఇక మీ అమ్మాయికి ఎలాంటి భయం లేదు. వచ్చే ఆదివారం ఆ సీసాను ఊరి బయట బావిలోనో చెరువులోనో పారెయ్యండి, ఇక వస్తాను.'

'ఉండండి బాబూ!'

'ఎందుకూ? నేను డబ్బు కోసం రాలేదు. మీ అమ్మాయి పెళ్ళికి పిలవండి వస్తాను' నవ్వుతూ అన్నాడు.

'మీ అడ్రసు!'

'మీ అబ్బాయిని తీసుకెళ్తాను!'

'ఎందుకూ?' చంద్రయ్య భయంగా అడిగాడు.

బాబా పకపకా నవ్వాడు.

'మీ అబ్బాయిని నేనేమీ చెయ్యనులెండి. నాకు టైం లేదు, త్వరగా వెళ్ళాలి. ఆ సీసా తీసేప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తల్ని గురించి చెప్పాలి. రామమందిరం దాకా తీసుకెళ్తాను. రండి, మీ పేరు?'

'కిశోర్!' అతని వెనకే నడుస్తూ అన్నాడు.

ఇద్దరూ కారు వెనక సీట్లో కూర్చున్నారు.

'మీరు చదువుకొన్నారా?'

'ఎం. ఏ. చేస్తున్నాను'

కారు కదిలింది.

'మీరు దెయ్యాల్నీ భూతాల్నీ నమ్ముతారా?' బాబా అడిగాడు.

'ఇంతకుముందు నమ్మేవాణ్ణి కాదు.'

'ఇప్పుడు ఒప్పుకున్నారు. మీరు చదువుకున్నారు. మీ అమ్మా నాన్నా అమాయకులు. మూఢనమ్మకాల్లో ఉన్నారు. మీకూ బుర్రలేదా? స్వయంగా ఆలోచించ లేదా? మీ చెల్లెల్ని ఏ సైకియాట్రిష్టుకైనా చూపించాలని అనిపించలేదా?'

బాబా మాటలకు వెర్రివాడిలా చూశాడు. బాబా ముఖంమీద ఉన్న కుంకం బొట్టు చెరుపుకొన్నాడు. తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు. అది చూసి కిశోర్‌కి మతిపోయింది. "డాక్టర్ చంద్రమోహన్ ఎం. డి. సైకోథెరపిస్టు" అని ఉంది.

"అవును !"

కిశోర్ తన అనుమానాలను వెలిబుచ్చాడు.

నేను కల్పనను హిప్నటైజ్ చేసి అన్నీ తెలుసు కొన్నాను. అతను చనిపోయే ముందురోజు మీ రెవరూ లేనప్పుడు మురళి వచ్చాడు. కల్పన చెయ్యి పట్టుకొన్నాడు. బెదిరిపోయి చెయ్యి లాక్కుంది. దాన్ని అతను అపార్థం చేసుకొన్నాడు. 'నేను నీతోనే ఉంటాను, నిన్ను ప్రేమి స్తున్నాను' అంటూ వెళ్ళిపోయాడు. అతన్ని తల్చుకొంటూ పడుకొన్న కల్పనకు తెల్లవారుఝామున అలాంటి కల రావడం సహజమే. నిద్ర లేస్తూనే అతను చనిపోయాడని విన్నది. భయపడిపోయింది. బాధపడింది. దాదాపు మతి

చలించినంత పని అయింది. అతని మాటలు విన్పించసాగాయి. దాన్నే ఆడిటరీ హెల్యూసినేషన్ అంటారు. అతను తనతో నే ఉంటున్నట్టు భ్రమ. హిస్టిరిక్‌గా అయింది.'

'మరి ఆ నిమ్మకాయల నుంచి...'

"కారింది రక్తం కాదు! నిమ్మరసమే. కాయలు మీరు తెచ్చారు. కాని కత్తి మాదే! దానికి ముందే జపా పుష్పాలను రుద్ది ఉంచాము. ఇక సీసాలో దెయ్యాన్ని బంధించడం సంగతి— ఆ సీసాలో అమోనియా ద్రవాన్ని రెండు చుక్కలూ, సీసా మూతలో హైడ్రో క్లోరిక్ ఆమ్లం రెండు చుక్కలూ వేసి, నాలుగైదు వెంట్రుకల్ని సీసాలో వేసి మూత బిగించగానే ఆ రెండింటి కలయికతో సీసాలో పొగలాంటి వాయువు ఏర్పడింది. దాని వత్తిడికి వెంట్రుకలు పైకీ కిందకూ కదిలాయి. అంతే! చిన్న ట్రిక్!

మన దేశంలో ఇలాంటి మూఢనమ్మకాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. దొంగ మంత్రగాళ్ళు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. ప్రజలు ఎంత మూర్ఖంగా ఉన్నారంటే— ఎక్కడైనా ఒక బొరియలో పది తేళ్ళు ఒక్కసారి బయటికి వస్తే ఎవరో బాణామతి చేశారని భయపడిపోతారు. మన దౌర్భాగ్యం చదువుకున్న నీలాంటి యువకులు కూడా ఇలాంటివి నమ్మడం."

"నాకు నమ్మకం లేదండీ... కాని..."

"మురళీ సంగతి? అతను చదువుకొన్నవాడు. చచ్చి దెయ్యం అవాలనుకొన్నవాడు. దానికేమంటావ్? ఇలాంటి కేసుల్ని సైకియాట్రిస్టుకు చూపాలంటే భయం. దానికి కారణం సైకియాట్రిస్టుచేత ట్రీట్‌మెంటు ఇప్పించేది పిచ్చి వాళ్ళకేననే అభిప్రాయం. దయ్యం పట్టి వదిలిన వాళ్ళను ప్రజలు చిత్రంగా చూడరు. కాని కొంచెం మనస్థిమితం తప్పి నార్మల్ అయిన వ్యక్తిని ఈ సమాజం పిచ్చివాడిగానే చూస్తుంది.

నిజంగానే పిచ్చెక్కించేస్తారు. ఇప్పుడు నా విషయమే చూడండి. నేను డాక్టరుగా వస్తే మీ తల్లి దండ్రులకు నామీద నమ్మకం కుదరదు. అందుకే మంత్రగాడిలా రావాల్సి వచ్చింది.''

"మరో విషయం..." ఎలా అడగాలో తెలియక తల గోక్కున్నాడు కిశోరు.

"నాకు అర్థం అయింది. నెల తప్పడం. అది కూడా సైకలాజికల్‌గా జరిగిందే. కల్పనకు మురళీ అంటే ఇష్టమే! అతన్ని గురించి ఎన్నో కలలు కన్నది. ఇలాంటి విషయాలు మీలాంటి కుర్రాళ్ళు గుడ్డిగా నమ్మడం ఏమిటి? కాస్తయినా రీజనింగ్ ఆలోచించనక్కర్లేదా? ఇలాంటి విషయాల్లో నాకు వీలున్నంతవరకు ఏదో చెయ్యాలనే సంకల్పంతోనే ఉన్నాను. నావల్ల కొందరి బ్రతుకులు బాగైనా చాలు. మీ లాంటి

చదువుకున్న యువకులు మూఢనమ్మకాల్ని ఛేదించాలి. అందుకు ఓ ఉద్యమం లేవదీయాలి."

"ఇక మా చెల్లెలు...".

"ఇక మీ చెల్లెలికి ఎలాంటి ప్రమాదం లేదు. మురళి ఆత్మను— అదే దెయ్యాన్ని సీసాలో బంధించానని నమ్మింది"

"థ్యాంక్యూ సర్ !"

"వెల్‌కమ్ !"

కారు ఆగింది. కిషోర్ దిగి రెండు చేతులూ ఎత్తి డాక్టరుకు నమస్కరించాడు.

0 0 0